క్లుప్తంగా

నర్సాపూర్‌లో అంగన్‌వాడీ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్: నర్సాపూర్‌లో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం అంగన్‌వాడీలు ర్యాలీ చేపట్టారు. ర్యాలీని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళకుమారి వివరించారు. కౌన్సిలర్లు సురేష్, యాదగిరి, రాంచందర్, ఆయా పార్టీల నాయకులు, అంగన్‌వాడీ టీచర్ అన్నపూర్ణ పాల్గొన్నారు.

మైనంపల్లిని కలిసిన నేతలు



మైనంపల్లిని కలిసిన నేతలు

చేగుంట(తూప్రాన్): మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును స్థానిక నాయకులు హైదరాబద్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి వివిధ అంశాలపై చర్చించినట్లు ఆయన చెప్పారు. కలిసిన వారిలో వెంగళ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లక్ష్మణ్, రాఘవ తదితరులు ఉన్నారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేత



దివ్యాంగుడికి వీల్‌చైర్ అందజేస్తున్న బ్రహ్మాజీ

మెదక్ కలెక్టరేట్: దివ్యాంగుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని డీడబ్ల్యూఓ బ్రహ్మాజీ పేర్కొన్నారు. మంగళవారం దరఖాస్తు చేసుకున్న ఓ దివ్యాంగుడికి వీల్‌చైర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులు దరఖాస్తు చేసుకుంటే వారికి బ్యాటరీ స్కూటర్, ట్రైసైకిల్, ఇతర సామగ్రి అందిస్తున్నామని తెలిపారు. అంతేకాకుండా వారికి రుణాలు ఇప్పించి స్వయం ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

రైతు భరోసాను వెంటనే అందించండి

టేక్మాల్(మెదక్): జాప్యం చేయకుండా రైతుభరోసాను రైతులకు వెంటనే అందించాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా యువత కార్యదర్శి నాయికోటి భాస్కర్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ... రైతుల అభిప్రాయ సేకరణ అంటూ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఎకరాకు 15వేలు ఇవ్వాలన్నారు. రుణమాఫీ సైతం ఎలాంటి ఆంక్షలు లేకుండా చేయాలన్నారు.

గుర్తుతెలియని మృతదేహం

రామాయంపేట(మెదక్): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మండలంలోని అక్కన్నపేట రైల్వేస్టేషన్ సమీపంలో దారిన పోతున్న బాటసారులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. వారు ఇక్కడికి చేరుకొని పరిశీలించారు. 55 ఏళ్ల వయసు ఉంటుందని భావిస్తున్నారు. అతడు భిక్షాటన చేసే వ్యక్తిగా ఎస్ఐ రంజిత్ అనుమానిస్తున్నారు. అతడి వద్ద ఎలాంటి వస్తువులు లభించలేదు. కేసు నుపోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

సదాశివపేట(సంగారెడ్డి): ఎటువంటి షరతులు లేకుండా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చే యాలని తెలంగాణ ప్రజాశక్తి పార్టీ రాష్ట్ర అధ్య క్షుడు దొడ్ల వెంకట్ డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎలాంటి షరతులు లేకుండా రుణ మాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్‌కార్డు ఉంటేనే రుణమాఫీ చేస్తామని ప్రకటించడం సరైంది కాదన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని తెలిపారు. లేని పక్షంలో రైతులను కూడగట్టి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్త బస్వరాజ్‌పాటిల్, కార్యదర్శి వీరేష్, జిల్లా అధ్యక్షుడు రవి, ఇన్‌చార్జి బ్రహ్మాచార్జి, తదితరులు పాల్గొన్నారు.

‘మిత్ర’బంధం!

- ఈ పురుగులతో రైతుల పంటలకు మేలు
- గుర్తించి కాపాడుకోవాలి
- వేప నూనే పిచికారీ మంచిది
- అవగాహనతో మరింత మేలు
- టేక్మాల్ వ్యవసాయాధికారి రాంప్రసాద్



వానపాములు



ఆరుద్ర పురుగులు

టేక్మాల్(మెదక్): వానాకాల, రబీ సీజన్‌లలో పంటలు సాగు చేస్తుంటే రైతులు తమ పైర్లకు మేలు చేసే పురుగులను గుర్తించాలి. పంటలకు మేలు చేసే పురుగులు కనిపిస్తే పురుగుమందుల పిచికారీ ఆపాలి. తెగుళ్లు, చీడల గురించి అవగాహన తప్పనిసరి. మేలు చేసే పురుగులకు వేప నూనే పిచికారీ చేస్తే ఎలాంటి హానీ ఉండదు. మిత్ర పురుగులను కాపాడుకోవాలి అని టేక్మాల్ వ్యవసాయాధికారి రాం ప్రసాద్ తెలిపారు. ఆ మేరకు ఆయన సలహాలు, సూచనలివే..

- తూనీగ: తమ కంటే చిన్నగా ఉండే కీటకాలను వేటాడుతాయి. ముఖ్యంగా పంటలపై వాలిన ఈగలను, దోమలను తింటాయి.
- తుమ్మెదలు: ఇవి ఎక్కువగా వేసవి ప్రారంభంలో కనిపిస్తాయి. పంటలను నష్ట పరిచే చిన్న చిన్న కీటకాలను, నత్తలను తింటాయి.
- వానపాములు: ఇటి మట్టిని తింటూ విసర్జిస్తాయి. తోటల మొదళ్లల్లో వేస్తారు. పాదుల్లో వానపాములు తరుగుతుంటే మట్టి గట్టిపడకుండా చేసి నీటిని త్వరగా భూమిలోకి ఇంకిపోయేలా చేస్తాయి.



- ఆరుద్రపురుగు: చిన్నగా ఎరుపు రంగులో ఉంటాయి. సుతిమెత్తగా ఉండి మెరుస్తూ కనిపిస్తాయి. ఇవి వర్షాలు కురిసినప్పుడు ఆరుద్రే కార్తెలో కనిపిస్తాయి. నేలను సారం చేస్తాయి. రైతులు ఇవి కనిపిస్తే ఎంతో శుభం కలిగినట్లు భావిస్తారు.
- గొల్లభామలు: ఈ పురుగు ఆకుపచ్చగా ఉంటుంది. ఇవి ముందు కాళ్లతో చిన్న పురుగులపైన దాడి చేసి తినేస్తుంది. శనగపచ్చ లద్దె పురుగులను కూడా తినేస్తుంది.
- కందిరీగ: ఇవి మొక్కల్లో పరపరాగ సంపర్కానికి ఉపయోగపడి ఫలదీకరణం జరిగేలా ఉపయోగపడతాయి. హానీకరమైన చిన్న పురుగులు, పంటపై పెట్టి గుడ్లను తినేసి వాటి ఉధృతిని తగ్గించడంతో పాటూ పంటను రక్షిస్తాయి. బద్దెపురుగులను ఇష్టంగా తింటాయి.
- గ్రౌండ్‌బీటిల్స్: ఈ పురుగు గోధుమ లేదా నలుపు రంగు కలిగి మెరుస్తుంటుంది. ఇవి రాళ్ల కింద, దుంగలు, బెరడు, శిథిలాల కింద ఉంటూ రాత్రి పూట చీడ పురుగులు, లద్దె పురుగులు, నల్లిగుడ్లు, నంగ్స్, నత్తలను తింటాయి.
- క్రైసోఫా: లేత ఆకుపచ్చ లేదా గోధుమ రంగులో కనిపిస్తాయి. శరీరం కంటే రెక్కలు మూడు రెట్లు అధికంగా ఉంటాయి. ఇవి అఫిడ్స్, మిలీబగ్స్, త్రిప్స్‌ను తింటాయి. పూర్తిగా ఎదిగిన లార్వాలు అయితే, రోజుకు వంద కంటే ఎక్కువ కీటకాలను నాశనం చేస్తాయి.
- సాలే పురుగు: ఈ పురుగులు పంట మొక్కల్లో, గుళ్లు అల్లుతూ వీటికంటే చిన్న పురుగులను, దోమలను, లార్వాలను, నల్లులను, రెక్కల పురుగులను తిని పంటలను రక్షిస్తాయి.
- చీమలు: ఇవి పొలాల్లో తిరుగుతున్న పురుగులను, పేనుబంక, పచ్చ దోమ గుడ్లను తిని రైతులకు సహాయం చేస్తాయి.



రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న రైతులు

కొనసాగుతున్న నిరాహార దీక్షలు

నర్సాపూర్: కొండ పోచమ్మ కాలువ వద్దు-సెమీ అర్బన్ ముద్దు అంటూ రైతులు చేపట్టిన రిలే నిరహార దీక్షలు మంగళవారం నాటికి ఐదో రోజుకు చేరాయి. సంగారెడ్డి రీచ్-2 కాలువకు తమ భూములు ఇవ్వబోమని రైతులు రిలే నిరహార దీక్షలు చేపట్టారు. దీక్షలలో చిన్నచింతకుంటకు చెందిన నర్సింహ్మారెడ్డి, రమేష్, ఆంజనేయులు, శ్రీశైలం, సత్తయ్య, బ్రాహ్మణపల్లికి చెందిన రాంకిషన్, రాజుగౌడ్ తదితరులు దీక్షలో పాల్గొన్నారు. అనంతరం రైతులు మాట్లాడుతూ తమ భూములు కాలువకు ఇవ్వమని, తప్పనిసరిగా ప్రభుత్వం తమ భూములు తీసుకుంటే భూమికి భూమి ఇవ్వాలని, లేదా ఎకరానికి రూ.60 నుంచి 70లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండు చేశారు.

రేషన్‌కార్డు నిబంధన సరికాదు



మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ మహేశ్ గుప్తా

శివ్వంపేట(నర్సాపూర్): కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ విషయంలో తెల్ల రేషన్‌కార్డు నిబంధన విరమించుకోవాలని శివ్వంపేట మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేశ్ గుప్తా అన్నారు. మంగళవారం శివ్వంపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు అన్ని వర్గాల రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారం లోకి రాగానే తెల్ల రేషన్‌కార్డు ఉన్న రైతులకు మాత్రమే చేస్తామని చెప్పడం మోసం చేయడమేనన్నారు. రేషన్ కార్డు నిబంధనతో లక్షలాది మంది రైతులు నష్టపోతారన్నారు. ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, పోచగౌడ్, కొండల్, రాములుగౌడ్, వెంకటేష్, లక్ష్మీనర్సయ్య, పైనం యాదగిరి, రాజు, తదితరులు ఉన్నారు.

ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలి



సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజు సంఘం నేతలు

రేగోడ్(మెదక్): సమస్యలను పరిష్కరించాలని ముదిరాజ్‌లు కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ చెతక్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు వడ్డేపల్లి శివకుమార్ మాట్లాడుతూ ముదిరాజ్‌లను వెంటనే బీసీ ఈ నుంచి బీసీ-ఏ లోకి మార్చాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, వెయ్యి కోటత్లో కార్పొరేషన్ చెరువులు కుంటలపై హక్కులు కల్పించాలని కోరారు. మత్స్య సహకార సంఘాలకు చేప పిల్లలను సబ్సిడీ రూపంలో సకాలంలో అందివ్వాలన్నారు. ఫిషరీస్ ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ముదిరాజ్ సంఘం బాధ్యులు గౌండ్ల బసవేశ్వర్, బోయిని సాయిలు, పుట్టి దుర్గయ్య, కర్ణకోటి రాములు, పాంపాటి రాములు, గువ్వలి రమేశ్ పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్య



కౌడిపల్లి(నర్సాపూర్)లో..

కౌడిపల్లి(నర్సాపూర్): పిల్లలకు ఆట పాటలతో విద్య నేర్పుతామని వారిని అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని టీచర్లు తెలిపారు. మంగళవారం కౌడిపల్లిలో అమ్మ మాట అంగన్‌వాడీ బాటలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రెండున్నరేళ్ల ఉన్న పిల్లలను అంగన్‌వాడీలకు పంపించాలన్నారు. ఆటపాటలతో విద్యా నేర్పడంతోపాటు పౌష్టికాహారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీచర్లు కమల, సుమిత్ర, నిర్మల, రజియాసుల్తానా తదితరులు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిన్నారులను అంగన్‌వాడీలలో చేర్పించాలని టీచర్లు అన్నారు. మంగళవారం మండలంలోని చండూర్‌లో అమ్మ మాట అంగన్‌వాడీ బాటలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ చిన్నారులను ప్రీస్కూల్‌లో చేర్పించాలని కోరారు. టీచర్లు శశికళ, యాదమ్మ, ఉపాధ్యాయురాలు శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత



నర్సాపూర్: ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ చంద్రశేఖర్

నర్సాపూర్: వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు. ఆయన మంగళవారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరం, మలేరియా, డెంగీ, డయేరియా లాంటి వ్యాధులతో వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు.

16వ వార్డులో ప్రత్యేక డ్రైవ్

తూప్రాన్: పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మామిళ్ల జ్యోతికృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని 16వ వార్డులో శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని పలు కాలనీల్లో మురుగుకాలువలు, రోడ్లు, పిచ్చిమొక్కలు తొలగింపు తదితర శానిటేషన్ పనులను సిబ్బందితో చేపట్టారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని కార్యదర్శులు ప్రశాంతి, ఆనంద్, భూమేష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అజ్జమర్రి, బండపోతుగల్, శీలాంపల్లి, బద్యాతండాలలో ఇంటింటికీ ఆరు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంపిణీ చేసిన మొక్కలను ఇంటి ఆవరణలో నాటి బాధ్యతగా పెంచాలన్నారు. వనమహోత్సవంలో నాటిన మొక్కలను ధ్వంసం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వన మహోత్సవానికి మొక్కలు సిద్ధం

వెల్దుర్తి(తూప్రాన్): వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి వెల్దుర్తి మండలంలో నాటేందుకు అన్ని గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయని ఎంపీడీఓ విఘ్నేశ్వర్ అన్నారు. మంగళవారం మాసాయిపేట నర్సరీని సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. నర్సరీల్లో ఔషధ మొక్కలతో పాటు పండ్లు, పూల మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. మొక్కలను ప్రభుత్వ స్థలాల్లోనే కాకుండా ఖాళీ ప్రదేశాల్లోనూ నాటేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. గ్రామస్తులకు మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ వెంట ఈజీఎస్ ఏపీఓ రాజు ఉన్నారు.

లక్ష్యం.. లక్ష మొక్కలు

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రతి పంచాయతీలో లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా మంగళవారం మండలంలోని తునికి ఎస్సీ కాలనీ సమీపంలో రహదారి వెంట మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో 4 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఆ మేరకు నాటి సంరక్షించాలని తెలిపారు. వర్షం కురుస్తున్నందున అన్ని గ్రామాలు, తండాల్లోను నాటాలని చెప్పారు. దీంతోపాటు రైతులు పొలం గట్టుపై నాటేందుకు టేకు, ఇతర మొక్కలు పంపిణీ చేస్తామన్నారు.



నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ విఘ్నేశ్వర్



చిలప్‌చెడ్(నర్సాపూర్): అజ్జమర్రిలో మొక్కలను పంపిణీ చేస్తున్న కార్యదర్శి ప్రశాంతి

రైతులు పండ్ల తోటలు పెంచుకునేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ పుణ్యదాస్, ఇన్‌చార్జి ఎంపీఓ వెంకటేశం, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, టీఏ హీర్య తదితరులు పాల్గొన్నారు.

అల్లాదుర్గం(మెదక్): ప్రతి ఇంటిలో కనీసం ఐదు నుంచి పది మొక్కలు నాటాలని ఎంపీడీఓ శంకర్ చెప్పారు. మంగళవారం మండలంలో వన మహోత్సవలో భాగంగా ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీఒక్కరూ ఇంట్లో, పొలాల వద్ద మొక్కలు నాటి కాపాడే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన సిబ్బంది

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో ఎంపీడీఓ రవీశ్వర్‌గౌడ్‌తోపాటు సిబ్బంది మంగళవారం వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో అందరూ భాగస్వాములై ఇంటింటికీ మొక్కలు నాటాలని సూచించారు. ఉపాధి హామీ సిబ్బంది లక్ష్మణ్, సెక్రెటరీ నామ్యానాయక్ తదితరులు ఉన్నారు.

కొల్చారం(నర్సాపూర్): పచ్చదనం కోసం మొక్కలు నాటడంతో పాటు సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీఓ లక్ష్మీనర్సింహులు పేర్కొన్నారు. మంగళవారం వనమహోత్సవంలో భాగంగా పోతిరెడ్డిపల్లి, కొంగోడ్, నాయిని జలాల్‌పూర్ గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఏపీఓ మహిపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు మౌనిక, సౌజన్య, ఫీల్డ్ అసిస్టెంట్లు సత్యనారాయణ, యాదుల్ పాల్గొన్నారు.

టీజీఐఐసీ చైర్మన్‌ను కలిసిన నాయకులు



టీజీఐఐసీ చైర్మన్‌ను కలిసి కాంగ్రెస్ నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): టీజీఐఐసీ చైర్మన్ నిర్మలను మంగళవారం కాంగ్రెస్ పార్టీ కౌడిపల్లి మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాహెబ్ పాష తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వరుణదేవా.. కరుణించవా..



అభిషేకం చేస్తున్న మధుసూదనానంద సరస్వతి

మండలంలోని భస్వాపూర్ మల్లికార్జునస్వామి దేవాలయంలో మంగళవారం వర్ష పాశుపత అభిషేకం నిర్వహించారు. మధుసూదనానంద సరస్వతి ఆలయంలోని పుట్టులింగానికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. మల్లికార్జునుడి అనుగ్రహంతో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని అభిషేకం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మల్లేశం తెలిపారు.

– వెల్దుర్తి(తూప్రాన్):

సంక్షిప్త వార్తలు

◆ సీఎంను కలిసిన సుధీర్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గోమారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు సుధీర్‌రెడ్డి మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. తన జన్మదినం సందర్భంగా సీఎంను హైదరాబాద్‌లో కలిసి ఆశీర్వాదం తీసుకున్నట్లు సుధీర్ రెడ్డి తెలిపాడు.

◆ లయన్స్ క్లబ్ పాలక కమిటీ ఏకగ్రీవం

నర్సాపూర్: నర్సాపూర్‌లోని లయన్స్‌క్లబ్ ఆఫ్ నర్సాపూర్ స్నేహబంధు నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా జైపాల్, కార్యదర్శిగా శ్రీకాంత్, కోశాధికారిగా మాణిక్యంగౌడ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా న్నట్లు ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ లయన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

◆ మండలంలో మోస్తరు వర్షం

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో మంగళవారం మోస్తరు వర్షపాతం నమోదైంది. ఉదయం నుంచి చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఆరుతడి పంటలతో పాటు బోరుబావుల వద్ద వరినాట్లు వేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. వర్షానికి రహదారులన్నీ చిత్తడిగా మారాయి.

◆ నేటి నుంచి విఠలేశ్వరస్వామి ఉత్సవాలు

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేటలోని రుక్మిణీ విఠలేశ్వరస్వామి ఉత్సవాలను ఈ నెల 17 నుంచి 21వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా పుణ్యాహవచనం, ప్రత్యేక అభిషేకాలు, 18వ తేదీ గురువారం అభిషేకాలు, ఉపవాస దీక్షల విరమణ, గణపతి నవగ్రహ రుక్మిణీ పాండురంగ మూలమంత్ర హవనం, 19న రుక్మిణీ విఠలేశ్వర కల్యాణ మహోత్సవం, భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. 20న రథోత్సవం, 21న పౌర్ణమిని పురస్కరించుకొని అభిషేకాలు, సామూహిక కుంకుమార్చన, సాయంత్రం పల్లకీసేవ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

◆ రైతులందరికి రుణమాఫీ చేయాలి

చిన్నశంకరంపేట(మెదక్): రైతులందరికి బేషరతుగా రుణమాఫీ చేయాలని చిన్నశంకరంపేట మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పట్లోరి రాజు కోరారు. రేషన్‌కార్డు ప్రామాణికంగా తీసుకుంటే లక్షలాది మంది రైతులకు అన్యాయం జరుగుతోందని చెప్పారు. ప్రభుత్వం వెంటనే రైతులందరికి రుణ మాఫీ చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

◆ అంగన్‌వాడీల ర్యాలీ

మనోహరాబాద్(తూప్రాన్): అమ్మ మాట అంగన్‌వాడీ బాట అని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్ల ఆధ్వర్యంలో ఆయా గ్రామాలలో మంగళవారం ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 3-6 సంవత్సరాల లోపు పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలని, వారికి ఆటపాటలతో పాటు, నాణ్యమైన బోధన అందిస్తున్నామని, పోషకాహారాన్ని సైతం అందింస్తున్నామని తెలిపారు.

◆ కాళ్లకల్ వద్ద వాహనాలు ఢీ, తప్పిన ప్రమాదం

మనోహరాబాద్(తూప్రాన్): జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న వాహనాలు ఒకదానితో ఒకటి ఢీకొన్నాయి. ఈ సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. హైదరాబాద్ నుంచి తూప్రాన్ వైపు వెళ్తున్న లారీ, డీసీఎం, బొలేరో వాహనాలు మండలంలోని కాళ్లకల్ బంగారమ్మ దేవాలయం సమీపంలో అదుపు తప్పి ఒకదానికి ఒకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో చిన్నచిన్న గాయాలతో బయటపడ్డారు. ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు అక్కడికి చేరుకుని వాహనాలు పక్కకు జరిపారు. ఆ మేరకు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.